మీరు అనుభవించే భోగాలలోని దోషాలు మీకు తెలియవు అంటున్నారు ఆచార్యులవారు. ఆ దోషాలు నుండి బయటకు రావటం వేరే విషయం అసలు ఆ భోగాలలో దోషం ఉంది అనే గుర్తింపు కూడా మీకు రాదు అని చెపుతున్నారు. నోటిలో ముద్ద పెట్టుకోనేవరకూ మాటలు మాట్లాడతాము. ముద్దపెట్టుకొన్న తరువాత మాటలు ఆగిపోతాయి. అలాగే అహంకారంతో ఉన్నంతసేపు ఈగొడవలు, సాధనలు అన్నీ. చైతన్యం అనుభవంలోనికి వచ్చినప్పడు ఇవి అన్నీ ఆగిపోతాయి. సాధన చేయటానికి ఏమీ మిగలదు. నిద్రలో ఉన్నవారిని లేపటానికి పిలుస్తాము, లేవకపోతే చేతితో తడతాము, ఇంకా లేవకపోతే కొడతాము. అలాగే మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. అందులో నుండి మేల్కొవటానికి గురువు యొక్క మాట, చేత, చూపు అన్నీ నీకు సహకరిస్తాయి. గురువు ఆగ్రహం కూడా అనుగ్రహమే అని ఎవడైతే భావిస్తున్నాడో వాడు నిజమైన భక్తుడు. నీకు ఎడతెగని భక్తి ఉండాలి. నీవు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో దానిమీద సజీవమైన విశ్వాసం ఉండాలి. సత్యవస్తువు ఒకటి ఉంది అని సజీవమైన విశ్వాసం నీకు ఉంటే నీవు సాధనలో పురోగమిస్తావు.

## బల్లిపాడులో శ్రీనాన్నగారి ప్రవచనము 25-4-97

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

హిందూమతానికి సనాతనమతం అనిపేరు. ఈ మతం ఒకవ్యక్తి స్థాపించినదికాదు. దీనికి మూలం వేదం. ఇతర మతాలుఅన్నీ ఒక వ్యక్తినిబట్టి ఆయన బోధనలను ఆధారంగా చేసుకొని ఆ మతాలు ఏర్పాటు అవుతూ వచ్చాయి. మతంపేరు మీద మూర్ఖత్వమును, అజ్ఞానమును పెంచుకోకూడదు. మతంపేరుమీద, విద్యపేరుమీద వివేకం పెరగాలి. చైతన్యస్థాయి పెరగాలి. చైతన్యస్థాయి పెరగకపోతే ఆ మతానికి విలువలేదు , ఆ విద్యకు విలువలేదు. చైతన్యస్థాయి పెరగకపోతే ఎంత చదువు చదివినా అది కేవలము పొట్టకే పరిమితమవుతుంది. మనం పెంచుకొన్న వివేకం దైనందిన జీవితంలో మనకు ఉపయోగపడాలి. మనకు ఒక దేహం ఉంది. దేహపోషణ చూసుకొంటూ అన్నింటిలోనూ తుగుమాత్రంగా ఉంటూ మానవుడు జీవితగమాన్ని సాధించాలి.

దేవుడికి రూపంలేదు, నామంలేదు. దేవుడు అంటే చైతన్యమే. ఈ సృష్టికి అంతా చైతన్యమే ఆధారంగాఉంది. ఆధారంగా ఉన్న వస్తువు మనకు కనబడటంలేదు. పాలలో వెన్న ఉంది. అది మనకు కనబడటంలేదు. నువ్వులలో నూనె ఉంది. అది మనకు కనబడటంలేదు. మనకు కనబడటంలేదు కాబట్టి అవిలేవు అనటానికి వీలులేదు. అలాగేఈ ప్రపంచానికి ఆధారంగా ఉన్నది చైతన్యమే. అది మనకు కనబడటంలేదు కాబట్టి అదిలేదు అని అనుకోకూడదు. మనకు తెలియని విషయాలు చాలా ఉంటాయి. అవి అన్నిలేవు అనికాదు వాటిని తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. తెలుసుకోవాలి అనే కాంక్ష ఉంటే మనం జ్ఞానమును సంపాదించుకోవచ్చును. శ్రద్ద వలన తెలుసుకోవాలి అనే కాంక్ష వలన జ్ఞానం వస్తుంది. జ్ఞానం వలన మోక్షం వస్తుంది. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఉదయించిన సూర్యుడు అలాగే ఉండిపోడు అస్తమిస్తాడు, అస్తమించిన సూర్యుడు అలాగే ఉండిపోడు తిరిగి ఉదయిస్తాడు. అలాగే పుట్టినవాడు అలాగే ఉండిపోడు పెద్దవాడు అవుతాడు మరణిస్తాడు. మరణించినవాడు అలాగే ఉండిపోడు తిరిగి పుడతాడు అని గౌతమబుద్దుడు చెప్పాడు.

నీకు నేను అనే తలంపు వస్తోంది . నేను అనే తలంపు నీకు తెలుస్తోంది కాని అది ఎక్కడనుండి వస్తోందో నీకు తెలియటంలేదు. అది ఎక్కడ పుట్టివస్తోందో నీకు తెలిస్తే నిజంనీకు తెలుస్తుంది. ఆ నిజాన్ని ఎందుకు తెలుసుకోవాలి? నీవు డబ్బు సంపాదిస్తున్నావు. ఎందుకు సంపాదిస్తున్నావు? డబ్బుతో భాగాన్ని అనుభవించవచ్చును అందువలన డబ్బును సంపాదిస్తున్నావు. అధికారాన్ని సంపాదిస్తున్నావు ఎందుకు ? అధికారంతో ఆనందమును అనుభవించాలి అని అధికారాన్ని సంపాదిస్తున్నావు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని ఎందుకు తెలుసుకోవాలి అంటే దానిలో శాంతి ఉంది, సుఖం ఉంది, ఆనందంఉంది, చావులేనిస్థితి ఉంది. అదే నీజీవితగమ్యం. నీ హృదయంలో ఉన్న చావులేని స్థితినీకు అనుభవంలోనికి వచ్చేవరకు నీకు నిజమైన సుఖం, శాంతిరాదు. ఎవరైనా మిమ్మల్ని బాగానేఉన్నారా, శాంతిగా ఉన్నారా అంటే బాగానే ఉన్నాము అంటారు. మర్యాదకోసం అలాచెపుతున్నారు గాని మీరు నిజంగా శాంతిగా ఉన్నారా అంటే శాంతిగా లేరు. హృదయంలో ఉన్న సత్యం అనుభవంలోనికి రాకుండా ఎవరైనా శాంతిగా ఉన్నాము అని చెప్పినా ఆ మాటలు అబద్ధం. నటనకోసం చెప్పేమాటలేగాని, వారు నిజంగా శాంతిగా లేరు, ఆనందంగాలేరు.

నీవు గాఢనిద్రలో దేహంతోటి, మనస్సుతోటి, ప్రపంచంతోటి రాగద్వేషములతోటి సంబంధంలేకుండా ఉన్నావు. అక్కడ నీవు లేవా అంటే నీవు ఉన్నావు. గాఢనిద్రలో ఉన్నవాడు ఇప్పుడు కూడా ఉన్నాడు. వాడు ఎక్కడకీ పోలేదు. నీవు ప్రయత్నంచేసి వాడిని అనుభవంలోనికి తెచ్చుకోగలిగితే అప్పుడు నీకు నిజమైన ఆనందం, శాంతి కలుగుతుంది. అది నీకడసారి జన్మ. జరిగిపోయిన గొడవలను నీ మనస్సులో మోయవద్దు. భవిష్యత్ గురించిఊహించవద్దు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నీ మనస్సు సమానంగా ఉండాలి. మనస్సుతో ఉన్నతాదాప్యమును వదులుకుంటే మనస్సు వెళ్ళి హృదయంలో పడిపోతుంది. అగ్నిహోత్రంలో నెయ్యిపోయటం యజ్ఞంఅని మనం అనుకొంటాము. స్వార్థంలేకుండా పనిచేయటమే యజ్ఞముఅని కృష్ణుడు చెప్పాడు. యజ్ఞభావముతో పనిచేసినపుడు నీ మనస్సుహృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. కళ్ళు మూసుకొని కూర్చోవటం యోగం అనుకొంటాము. పనిచేయకుండా సోమరితనంగా కూర్చొంటే యోగివి అవ్వవు. హృదయపూర్వకంగా పనిచెయ్యి. ఫలితం అధికంగావచ్చినా ఫలితం తక్కువగా వచ్చినా, అసలు ఫలితం రాకపోయినా నీ మనస్సులో వికారం రాకుండా ఉంటే నీవు యోగివి అవుతావు.

మనస్సును హృదయంలో ఉంచాలన్నా మనఅలవాట్లు యొక్క వేగం మనస్సును అక్కడ ఉండనివ్వటంలేదు. భక్తివలన మనస్సు హృదయంలో ఉంటుంది. దైనందిన జీవితంలో మనం సహజంగా, నిర్మలంగా జీవించాలి. అహంభావన లేకుండా జీవిస్తూఉంటే నీ ప్రయత్నంలేకుండా మనస్సువెళ్ళి హృదయంలో పడిపోతుంది. మనస్సు బాహ్యాముఖంగా ప్రయాణం చేస్తూ ఉంటే నీకు అశాంతి వస్తుంది. మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తూఉంటే నీకు శాంతి కలుగుతుంది. పురుషుడికి నిజమైన భార్య ఎవరు అంటే శాంతే నిజమైన భార్య. శాంతి తన అనుభవంలోనికి వచ్చినపుడు ఇంటిలో భార్య ఉన్నా, లేకపోయినా ఒకేలాగ ఉంటాడు. స్త్రీకి నిజమైన భర్త ఎవరు అంటే శాంతే నిజమైన భర్త. శాంతి అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంటిలో భర్త ఉన్నా, లేకపోయినా ఒకేలాగ ఉంటుంది. ఈ సృష్టి అంతానాది అనుకొని పనిచెయ్యి. అప్పుడు నువ్వు కర్మయోగివి అవుతావు. లేకపోతే ఈ సృష్టిలో ఏది నాదికాదు అనుకొని పనిచెయ్యి. అప్పుడు నువ్వు జ్ఞానయోగివి అవుతావు.

కాని మనం ఎటూ చెందకుండా తయారవుతున్నాము.

సంసారంలోగాని, సమాజంలోగాని నామాటలు నెగ్గాలి అనుకోవటానికి కారణం రూపదృష్టి, నామదృష్టి. రూప దృష్టి, నామదృష్టి ఉన్నంతసేపు ఎవడూ కూడా సమాజం యొక్క చైతన్యస్థాయిని పెంచలేడు. నువ్వు ముందు శాంతిలో ఉండు నిన్ను చూసి అనేక మంది శాంతిని పొందుతారు అనేవారు భగవాన్. జ్ఞానంగురించి, నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు గురించి విసుగులేకుండా వినాలి. డబ్బు, అధికారం వీటి విలువ నీకు తెలుస్తోంది కాబట్టి వాటిని పొందాలి అని ప్రయత్నం చేస్తున్నావు. దేనిని అయితే పొందాలి అనుకొంటున్నావో మొదట దానిని విలువ నీకు తెలిస్తే దానిని పొందటానికి ప్రయత్నం చేస్తావు. చైతన్యం గురించి వినగా వినగా నీకు దానిమీద ఇష్టం కలుగుతుంది. పూజ చేయమంటే 4 గంటలు, 5 గంటలు చేస్తారు గాని విషయాన్ని శ్రవణం చేయండి అంటే శ్రవణం చేయరు. ఎందుచేతనంటే శ్రవణం చేయాలి అంటే మనస్సుకు పని చెప్పాలి. శ్రవణం చేయకుండా విషయం ఎలా తెలుస్తుంది.

ఇతర విషయాలను చింతించకుండా నాకోసమే జీవిస్తూ ఉంటే నేను చెప్పిన మాటలు పరస్పరం చెప్పకొంటూ ఉంటే నీ మనస్సు స్వచ్ఛమవుతుంది అని భగవంతుడు చెపుతున్నాడు. ఎవరికి ఇష్టమైన పనులు వారు ఎలాగూ చేస్తారు. ఒక మంచి పనిని అది నీకు ఇష్టం లేకపోయినా ఇష్టం చేసుకొని చెయ్యాలి. అప్పుడు నీ మనస్సు పవిత్రం అవుతుంది. నిరంతరము ఆత్మను ధ్యానం చేస్తూ ఉంటే నీమనస్సు నిర్మలం అవుతుంది. పాలు పితికేటప్పుడు దూడను విడిచి పెడతారు. మీ అమ్మ దగ్గరకు వెళ్ళు, పాలు త్రాగు అని దానికి చెప్పాలా? అక్కరలేదు. విడిచిపెట్టిన వెంటనే అది గంతులు వేసుకుంటూ తల్లి దగ్గరకు వెళుతుంది. అదే విధంగా హృదయం ఎంత నిర్మలంగా ఉందో, ఎంత పవిత్రంగా ఉందో అంత నిర్మలత్వం, పవిత్రత నీమనస్సుకు పట్టినప్పుడు పాలకోసం తల్లిదగ్గరకు ఆవుదూడ ఎంత వేగంగా గంతులు వేసుకొంటూ వెళుతుందో అంతవేగంగా నీమనస్సు ఉరకలు వేసుకొంటూ హృదయం వైపుకు ప్రయాణించి హృదయంలో కలిసిపోతుంది.

సాత్వికులు ధన్యులు వారు దేవుని చూచెదరు. సమాధానపరచువారు ధన్యులు వారు దేవుని చూచెదరు. వివాదం ఉంటే దానిని తగ్గించటానికి చూడాలిగాని వివాదమును పెంచకూడదు. మిమ్మల్ని ఎవరైనా పొగడినా, ఎవరైనా విమర్శించినా ఆమాటలు అస్తమానూ జ్ఞాపకం వస్తూ ఉంటే మీమనస్సుతో మీకు తాదాప్యం ఉన్నట్లు గుర్తు. ఈ తాదాప్యమే మీ స్వరూప సుఖం నుండి మిమ్మల్ని దూరం చేస్తోంది. మనకు అహంకారం ఉందా, లేదా అని ఎలా తెలుస్తుంది అంటే నేను ఉన్నాను అనుకొనే వాడికి అహంకారం లేదు. నేను అలా ఉన్నాను. నేను ఇలా ఉన్నాను నేను ధనవంతుడిని, నేను పేదవాడిని, నేను గొప్పవాడిని అని ఇలాదేనితో ఒకదానితో తాదాప్యం పొందుతూ ఉంటే నీకు అహంకారం ఉన్నట్లే గుర్తు. నీవు కాని వస్తువులతో తాదాప్యం పొందుతున్నంతకాలం నీకు అహంకారం ఉన్నట్లే. ఇలా తాదాప్యం ఉన్నంతకాలం దుఃఖం నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నీవు దేనితోనూ తాదాప్యం పొందకపోతే మనస్సు వెళ్ళి హృదయంలోనికి జారిపోయి హృదయాకారం చెందుతుంది.